# మనసు లో బొమ్మ

ఈవారం కథ



అయిదు గంటలకంతా మెలకువ వచ్చేస్తుంది రమ్యకు. అపుడే లేచి చేసుకోవలసిన పనులేమీ లేకపోయినా, పెందలాడే లేవడం తనకలవాటు. సూర్యోదయాన్ని చూడ్డం ఎంతో ఇష్టం. ప్రభాత కాలంలో వీచే గాలి ఎంతో స్వచ్ఛంగా హాయిగా అనిపిస్తుంది. పక్షుల కలరవాలు తెల్లవారడానికి గుర్తుగా కాక చీకటి లోంచి వెలుగులోకి రావడంలో ఎంత ఆనందం వుందో తెలిపే ప్రయత్నంలా అనిపిస్తుంది. ఆ పక్షుల మేలుకొలుపు అజ్ఞానం నుంచి జ్ఞానోదయానికి, కాలుష్యం నుంచి పరిశుభ్రతకు, ద్వేషం నుంచి ప్రేమకూ మానవుని జాగృతం చేసే గానంలా వుంటుంది రమ్యకు.

రమ్య లేచి దిన చర్యలో భాగంగా మొక్కలకు నీరుపోస్తూ ఆకాశం వంక చూసింది. తూర్పు ఎంతలా ఎర్రబడిందో- రాబోయే బాల భానునికి హారతి పట్టడానికి పట్టుకొన్న ఎర్ర నీళ్ళ పళ్ళెంలా చల్లటి గాలిలో సేద దీరుతూ ప్రకృతిని , చూసి పరవశిస్తున్న రమ్యకు భర్త పిలువు వినిపించనే లేదు. "ఎన్నిసార్లు పిలవాలి-ఏమీటలా ఆకాశంకేసి చూడ్డం వింతగా-కాఫీ ఇచ్చి తగలడు చవ్వన-ఆరున్నరయింది టైము" ఆకాశం నుంచీ పాతాళానికి జారినట్టయింది రమ్యకు.

రమ్య భర్త ప్రసాద్. బ్యాంకులో పని చేస్తాడు. పెళ్ళై రెండేళ్ళయింది. రమ్యది మధ్య తరగతి కుటుంబం. అమ్మ బాగా చదివి, తన కాళ్ళ మీద తను నిలబడింతర్వాత కాని పెళ్ళి చేయలేదు. రవి అమ్మా, నాన్నలు కోడలి వుద్యోగంతో తృప్తిపడి పెళ్ళికి ఒప్పుకొన్నారు. దివ్య వచ్చాకే రవి చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశారు. రవికి బాధ్యతలేం లేవిప్పుడు. ఎప్పుడైనా తీరిక దొరికినవుడు దివ్య చెప్పిన కబుర్లవల్ల రమ్యకు తెలిసిన విషయాలివి.

గుమ్మానికి పూసలతో కర్టెన్ అల్లుతూ 'రాయినయినా కాకపోతిని రామపాదము సోకగా...' కూనిరాగం తీస్తుండగా దివ్య వచ్చింది. ఊరి నుంచి ఆ రోజే వచ్చింది. మనిషి నీరసంగా కనిపించినా గాంభీర్యం చెక్కు చెదరలేదు. రాగానే కుర్చీ లాక్కుని కూర్చుంటూ 'ఏమనుకోకండి' అంటూ కాళ్ళు టీపాయ్ మీద పెట్టి అలసటగా వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది. రమ్య జ్యూస్ కలిపి యిచ్చింది. "మీరదోలా వున్నారు. ఏదైనా ప్రాబ్లమా?" అని మృదువుగా అడిగింది రమ్య.

"అలాంటిదే. నాన్నగారికి ఓపెన్ హార్టు సర్జరీ చెయ్యాలట. లక్ష రూపాయల దాకా అవసరమవుతుంది. నాన్న పి.ఎఫ్. డబ్బులు, అమ్మ నగలూ కలిపి అరవై వేలు దాటదు. మిగిలిన డబ్బులు సర్దాలి నేను. అదే ఆలోచిస్తున్నాను"

"మీ వారిని అడిగి చూడలేక పోయారా"

"ఆయన కెందుకు తెలీదూ? అయినా ఏమీ మాట్లాడరు. మనం మగవాళ్ళ అవసరాలూ, వాళ్ళ కుటుంబ సభ్యుల అవసరాలూ కూడా గుర్తించి తీర్చడానికి ప్రయత్నిస్తాం. కానీ వాళ్ళు మాత్రం అలా కాదు."

"అయినా మీరుగా అడిగి చూడలేక పోయారా?"

"నాకిష్టం లేదండీ రమ్యగారూ! అలా అడగడం అంటేనే మన జుట్టు వాళ్ళ చేతికిచ్చినట్టు...మనం తప్పని సరిగా చేయవలసిన ముఖ్యమైన పనులు కూడా వాళ్ళ నడిగితే నెగటివ్‌గా సమాధానం రావడానికి అవకాశం వుంటుంది. అది నాకిష్టం లేదు. నేనీ సహాయం నాన్నకు చేయాలి. అది నా బాధ్యత. వస్తాను రమ్యగారూ! మీ జ్యూస్‌కు థ్యాంక్సు" అంటూ అదే చకచక నడకతో హుందాగా వెళ్ళిపోయింది. వచ్చినవుడు మనిషే కాదు. పది నిముషాల్లో తాజాగా ఐపోయింది. ఇంతకీ డబ్బులు ఇస్తుందా యివ్వదా? ఇస్తే ఎలా యివ్వగలుగుతుంది? రవి నాన్న, తమ్ముడు ఇంతే ప్రపంచం తమది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రమ్య చదువు స్కూల్ ఫైనల్‌తోనే ఆపేయాల్సి వచ్చినా, పరీక్షలు రాయడం ఆగిపోయింది కాని చదువు మానలేదు. తమ ఇంటికి కొద్ది దూరంలోనే వున్న లైబ్రరీలో అది ఇది అని గాక దాదాపు అన్ని పుస్తకాలూ చదివేసింది. ఎవరేమన్నా బదులు పలకని నెమ్మదయిన తత్వంవల్ల అణకువగల అమ్మాయన్న బిరుదు వచ్చింది. ఇదే ప్రసాద్‌కి భార్య అయ్యేలా చేసింది.

* * *

ఎంత పనిలో వున్నా దివ్య ఆఫీసుకు పోయేటప్పుడు గుమ్మం లోంచిగానీ,

**సకల శక్తి ప్రదాత**

**—శేషం సుప్రసన్నాచార్యులు**

శ్రీలు సుమాళించు సిరులెన్నో చిందించు
దుర్గభవాని నీ దుర్గమే స్వర్గమ్ము
నిన్ను నమ్మిన వారి నిర్మలత్వము నెరిగి
నిన్ను గొల్చినవారి నిష్ఠాత్మకము చూచి
ఈరేడులోకాల స్వారి చేయుదువమ్మ
కార్మికుల ఆత్మలో కలిమిదనమును నింపి
శ్రామికుల శక్తిలో సాధనమ్మును వంపి
ఆడపడుచుల స్వాంత మతిశయించుచుమండ
సౌభాగ్యమును పంచి సద్భాగ్యములనించి
సమరసములు జాలుగా స్వరజతులుపారగా
అన్యాయములనెంచి ఆగడమ్ములద్రుంచి
పేదబ్రతుకులనెల్ల పెన్నిధిగాబ్రోచి
సాధుజీవుల సదా కనురెప్పగాగాచి
సకల మతములయందు సమభావనలు నిరయ
సబల నయనాలతో వ్యధలామడలుపోవ
అభివృద్ధి నొందించు ఆత్మశక్తినొసంగి
బృహత్పథకాలతో ఉత్పత్తులందించి
జనభాగ్యములనెల్లి జాగృతమ్మొనరించి
కాపాడుమోయమ్మ! కమలాయతాక్షీ!
కరుణించుమో దుర్గమాంబా! లసమ్మూర్తి!

కిటికీలోనుంచిగానీ దివ్య వీధి మలుపు తిరిగే దాకా చూడ్డం రమ్యకలవాటు. దివ్య వాళ్ళు రమ్య వాళ్ళ ఎదురింట్లో వుంటారు. దివ్య భర్త రవికాంత్ కూడా ప్రసాద్ పనిచేసే బ్యాంకులోనే వుద్యోగి. ఈమధ్యే నాలుగు నెలల క్రితం ఇంటికి వచ్చారు. దివ్య కూడా కాలేజ్‌లో లెక్చరర్‌గా చేస్తోంది. తీరికైనవుడు రమ్యతో కాస్త మాట కలువుతుం టుంది. ఇద్దరూ మిత భాషులే కనుక స్నేహం అంతగా అభివృద్ధి కాలేదు. అయినా అవసరానికి ఏదైనా అడిగే చనువుంది.

ఎప్పటిలానే ఆ రోజూ రమ్య దివ్య వెళ్ళే టైముకు కిటికిలోంచి చూస్తూ నిలుచుంది. ఎంత చక్కగా వుంటుందో దివ్య. అంత చక్కగా ఇంకెవ్వరూ చీర కట్టలేరు. ఆ నడక చకచకా ఎంత చురుగ్గా వుందో. చూపులైతే ఎదుటి వారిని చదివేసేలా ఎంతో నిశితంగా వుంటుంది. "వంట పూర్తయితే వడ్డించి ఏడువ్. నేను బ్యాంకుకు వెళ్ళాకు తీరిగ్గా కిటికీలోంచి చూసుకుందువుగాని—అంత కంటే పనేముంది" ప్రసాద్ కేక విని ఈ లోకంలో కొచ్చింది రమ్య.

* * *

ఓ మధ్యాహ్నం వేళ మేటీపైన ఎంబ్రాయిడరీ చేస్తోంది రమ్య. హడావుడిగా వచ్చింది దివ్య. తమ ఇంటి కీస్ యిచ్చి "రవి వస్తే కాస్త ఇవ్వండి. నేను అర్జంటుగా మా వూరెళ్తున్నా. విషయాలు వివరంగా లెటరు వ్రాసి డ్రెస్సింగ్ టేబుల్‌పై వుంచాను. రవికి చెప్పండి" అంటూ అంతే హడావుడిగా వెళ్ళిపోయింది. సరేనని తలైనా తిప్పిందో లేదో గుర్తు లేదు రమ్యకు. ఎంతో ఆశ్చర్యపోయింది. ఎందుకంత అర్జంటుగా వూరెళ్ళిందో! ఎంత అర్జంటయితే మాత్రం భర్త అనుమతి లేకుండా వూరెళ్ళమనే విషయం రమ్య జీర్ణించుకోలేక పోతోంది.

రవి వస్తూనే విషయం చెప్పి కీస్ ఇచ్చింది. "ఏదో బలమైన కారణం లేందే దివ్య వెళ్ళదు" అని ఆదుర్దాగా ఇంటికి వెళ్ళాడు. కాసేపటికే రవి సూట్‌కేస్‌తో సహా వచ్చి "దివ్య నాన్న గారికి హార్ట్ ఎటాక్‌టండీ. నేనూ వెళ్తున్నాను. ఇల్లు కాస్త చూస్తూ వుండండి. అని ఆందోళనగా వెళ్ళిపోయాడు. ఇలాంటి మగవాళ్ళు కూడా వుంటారా! భార్య తరఫు వాళ్ళను మనుషులుగానే తలచని మగవాళ్ళే రమ్యకు తెలుసు.

రమ్యకు పెళ్ళైన కొత్తలో అమ్మకు బాగోలేదని, పక్షవాతమని ఉత్తరం వచ్చింది నాన్న దగ్గర నుంచి. అది తనకు లెటర్‌లా గాక టెలిగ్రాంలానే అనిపించింది. ఏం చేయాలో తోచ లేదు. ఒకటే ఏడుపు. భర్త ఆఫీసు నుంచి రావడమాలస్యం లెటరు చూపింది. ప్రసాద్ దాన్ని నింపాదిగా చదివి టీపాయ్ మీద పడేస్తూ "టిఫినేది పట్రా" అన్నాడు. త్రుళ్ళిపడింది రమ్య. లెటరు చూసిన కంగారులో టిఫిను సంగతే గుర్తులేదు తనకు. భర్త రాగానే ఊరెళ్దాం. తయారుకా. మీ అమ్మను చూసొద్దాం అంటాడనే తలుస్తూండప్పటిదాకా. "టిఫిన్ చేయలేదండీ. ఇవుడే నిముషంలో వుప్మా చేసుకొస్తా"నని కళ్ళూ ముక్కూ తుడుచుకుంటూ వంట గదిలోకెళ్ళింది. "అయితే లెటరు చూసినప్పటి నుంచి యేడుస్తూ కూర్చున్నావన్నమాట. ఎవరూ పోయారని రాయలేదుగా అందులో...." అంటూ భర్త సణగడం వినిపిస్తూనేవుంది రమ్యకు. తర్వాత నాలుగు రోజులకు తన అదృష్టం కొద్దీ బ్యాంకుకు నాలుగు రోజులు శెలవులు కలిసి రావడంలో వూరెళ్ళి అమ్మను చూసి రావడం జరిగింది. రెండేళ్ళుగా మంచాన పడి వున్నా పట్టుమని పది రోజులు తల్లికి సేవ చేయలేని జన్మ తనది. అందుకే దివ్య–రవిలను చూస్తే ఆశ్చర్యపోయింది రమ్య.

* * *

ఐదారు రోజులు దివ్యను చూడకుండా వుండవలసి రావడం రమ్యకు కష్టంగా వుంది. దివ్యకు అమ్మ, నాన్న తప్ప ఎవరూ లేరు. ఒక్కతే కూతురు. పెద్దగా వున్న వాళ్ళేం కాదు. ఈ విషయాన్ని ఎలా తీసుకుంటాడు? అదేదో తన జీవిత సమస్యలా టెన్షన్ పడిపోతోంది రమ్య.

"ఇదిగో—ఇది విన్నావా. నీ ఆరాధ్య ఆధునిక యువతి, అదే ఎదురించి దివ్య, భర్తనొదిలేసి వుట్టింటికెళ్ళిపోయిందట" ఆఫీసు నుంచి రాగానే ప్రసాద్ చెప్పిన వార్త ఇది. అయోమయంగా వున్న రమ్య ముఖం చూసి ప్రసాదే మళ్ళీ "ఏమిటి అలా చూస్తున్నావు? నిజమేనట. బ్యాంకులో అందరూ చెప్పకుంటున్నారు. ఆ టక్కులు చూసి నేనెప్పుడో అనుకున్నాను. ఇలాంటిదేదో జరుగుతుందని" అంటూ స్నానానికెళ్ళాడు. రమ్యకు చాలా బాధనిపించింది. దివ్య కాపురాన్ని వదులుకొని వుట్టింటికెళ్ళిందా! ఎందుకలా చేసింది? అలా ఆలోచిస్తూ పరధ్యానంగా పనులు చేసుకుంటున్న రమ్యకు, దివ్య నుంచీ వచ్చిన లెటరు ఎంతో సంతోషం కలుగజేసింది. ఎంతో సంభ్రమంతో లెటరు చదివింది.

డియర్ రమ్యా!

నా గురించి మీరీపాటికే ఆందోళన చెంది వుంటారు. మీరు చెప్పకపోయినా, నన్ను మీరు అడ్మైరింగ్‌గా చూడ్డం నాకు తెలుసు. అలాగే నేనూ మీరంటే ముచ్చట పడేదాన్ని. మీరు పొందికగా ఇంటి నంచుకోవడం, సున్నితంగా మాట్లాడడం, నిరాడంబరంగా అమాయకంగా వుండడం నాకు చాలా నచ్చేది. మీలాటి వాళ్ళు అదృష్టవంతులు రమ్యగారూ! మీరు మీ భర్త నీడలో హాయిగా వుంటూ, వూహా ప్రపంచంలో బ్రతికేస్తారు. సమస్యలు, ఘర్షణ వుండవు.

నేనలా కాదు రమ్యగారూ! మీలా నిర్లిప్తంగా వుండలేను. నా సమస్యను నేననుకున్నట్లే పరిష్కరించుకుంటాను. ఇదిగో యిక్కడే నాకూ, రవికి ఘర్షణ ఏర్పడింది. చెప్పానుగా నాన్న ఆపరేషనుకు డబ్బులు కావాలని. లోను అప్లయి చేశాను. తనను ముందుగా కన్సల్టు చేయకుండా, నా అంతట నేను డబ్బులు జమ చేసుకొని విషయం మాత్రం చెప్పడం రవికేమాత్రం ఇష్టం లేకపోయింది. అదే నేను ముందు చెప్పినా, రవి అందుకే మాత్రం ఇష్టపడకపోయేవాడే. బహుశా ఏడుస్తూ నా తప్ప కాయండని కాళ్ళమీద పడుంటే ఎలా వుండేదో—అది నేను చేయను. నాది తప్ప కానప్పుడు ప్రాధేయపడ్డమనే ప్రశ్నే రాదుకదా!

నాన్న బాగానే వున్నారు. రెండు వారాల్లో నాన్న అమ్మ కలిసి మన ఊరొచ్చేస్తాం. వాళ్ళు నాతోనే వుంటారు. రవికిష్టమైతే మీ ఎదురింట్లో ఎప్పట్లా, లేకపోతే వేరే ఇంట్లో. ప్రసాద్ గారిని అడిగానని చెప్పండి.

శుభాకాంక్షలతో

దివ్య

ఆ లెటరు చదివి చాలాసేపలానే కూర్చుండి పోయింది రమ్య. తనను కొన్నట్లే వుంది దివ్య లెటరు. ఇది ఇలా కాక ఇంకోలా వుంటే రమ్య మనసులోని దివ్య రూపం చెరిగిపోయేది.



14-10-94 ఆంధ్రజ్యోతి వారపత్రిక